రెండు రూపాలిచ్చినా కొంగుసాపుతున్నం. ఏదన్న కట్టం చేస్కొని బత్కండని కొందరి మాట!''..

ముసలి తాత పాత రోజులన్నీ కండ్ల ముంగట జరిగినట్టు చెప్పుకొంట పోతున్నడు.

''మనకున్న ఊర్లల్ల ఇంకోళ్లు పోవద్దని కట్టుబాటుండేది. పెద్దోండ్లు సెప్పిందే వేదం. కోర్టులేవు. వకీల్లు లేరు!''.

అంతదాన్క పెద్దాయన చెప్పినవన్నీ సెవులు గోస్కొని ఇంటున్న చిన్న బైరాగి ఒక్కసారే ఉలికిపడ్డడు.

''ఈ ఊరు నీది గదా నాయ్న! నాకియన్నీ తెల్వక వచ్చిన. కోప్పడకయ్యా.. నా మానాన నేను బోత!'' అంటూ, జోలెను చంకనేసుకొని తంబురను చేతికి తీసుకుండు.

ముసలి బైరాగి పోవద్దని చేతితో అతణ్ని పట్టుకొని..

''ఇంగ నేను తిర్గలేను కొడ్కా. నువ్వీ కాలపోడివైనా మన రుత్తిమీద నీకున్న ఇట్టం, గౌరవం చూస్తే నా తాతల



**మొన్నీమధ్యల..**
**'నా కాలమై పోయింది. నువ్వు ఊర్ల తిర్గు!' అంటే.. కొట్ట కొట్టొచ్చిండు నా కొడ్కు. నా మనుమన్ని బల్లెకు పంపి సదివిస్తనని పోతె.. కులం సప్టికెట్టు అడిగిండ్రట. వాడు నా మీద గరంగరం అయిండు. నిజంగనే మనం యేడ కుద్రుగ లేకుంటే సర్కారు గుర్తించకపాయె. పించిన్లు లేవాయె. గ్రూపుల్లేవాయె. అన్ని విదాల్ల సెడిపోతిమి. మన పిల్లగాల్లు బడికి పోవాల. నౌకరీలు సేయాల''..**

నాటి కాలం గుర్తొచ్చి సంబురమైతుంది. మొన్నీమధ్యల 'నా కాలమై పోయింది. నువ్వు ఊర్ల తిర్గు!' అంటే.. కొట్ట కొట్టొచ్చిండు నా కొడ్కు. నా మనుమన్ని బల్లెకు పంపి సదివిస్తనని పోతె.. కులం సప్టికెట్టు అడిగిండ్రట. వాడు నా మీద గరంగరం అయిండు. నిజంగనే మనం యేడ కుద్రుగ లేకుంటే సర్కారు గుర్తించకపాయె. పించిన్లు లేవాయె. గ్రూపుల్లేవాయె. అన్ని విదాల్ల సెడి పోతిమి. మన పిల్లగాళ్లు బడికి పోవాల. సదువుకోవాల. నౌకరీలు సేయాల'' అట్ల అనుకుంటుంటె.. అతని కండ్లల్ల మెరుపు.

''నువ్వు నా ఇంట్లనే ఉండు కొడ్కా. నువ్వు నాకు బర్వుగాదు. నా కొడుకు లెక్క సూస్కుంట. గీ ఇస యంల నా కొడ్కు నాతో జగడం బెట్టుకొని పెళ్లాం పిల్లల్తో గల్సి ఇంట్లనుండి ఎళ్లిపోయిండు'' అనుకుంట ఎక్కెక్కి ఏడిసిండు ముసలి బైరాగి.

* * *

రెండ్రోజుల్నుండి లోపల్లోపల పాడుకుంటున్నట్టు పెదవులు కదిలించుకుంట, మాటపలుకు లేకుండా తిండి లేకుండ కుక్కి మంచంల పడిఉన్న మగన్ని జూసిన ఆదెమ్మకు ఏడ్పొచ్చింది. మగడు తత్వం పాడుకుంటుండని ఆమెకు తెల్సు.

''పాడినవ్లే ఆపు!''.. కొడుకు విసుగ్గ అన్నమాట గుర్తొచ్చింది ముసలాయనకి.

''నువ్వు ఊర్లపొంటి అడుక్క తిన్నది సాలక.. నన్నీ దిక్కుమాలిన ఏశం యేస్కొని బిచ్చపోని లెక్క తిర్గ మంటవా? సాల్నాలు. ఈదాక ఏమేం సంపాదించి పెట్టినవ్. ఈ కాణ్నించి నీ జిగ్రి నాకొద్దు. ఏ కూలి పనో చేస్కుంట, నా కొడ్కును సద్వించుకుంట. గీ ఏశం నీతోటే పోవాలె!''.

కొడుకు మాటలకు బాధవడ్డ ముసలాయన..

''ఇది నా అయ్యల తాతలనాటి రుత్తి రా! ఇది నాకు అబ్బడం నా అదృట్టం. మననింత దాన్క తిండిపెట్టి బతికిచ్చిన దీన్ని అడుక్క తినడమంటవురా! గీ ఏశం తోటి, గీ పాటతోటే నా జీవం పోవాలె!''.

* * *

జర్గిందంత గుర్తొచ్చి ఉండుండి ముసలాయన కండ్ల నుండి నీళ్లు కారిపోతున్నయి.

కళ్లనీళ్లను తుడ్సుకుంటు ఒక్కసారె అదాటున ఆవేశంగ, ఉద్రేకంగ లేచి తలకు పేటా జుట్టి, నుదుర్ల తిరునామం పెట్టి, మెళ్ల తోలుతిత్తి తగిలించుకొని ఒక చేతిలో వెలుగుతున్న గరుడ స్తంభాన్ని, ఇంకో చేతిలో బుడబుక్క పట్టుకొని ఎదురుంగున్న చిన్న బైరాగితో..

''కొడ్కా! ఇయ్యాలొక్కరోజు నేను ఊరంత తిరిగొస్త. రేపటినుంచి నాకున్న ఆస్తంత నీకె!''.

అనుకుంట తడిక తీసి చీకటి వీధులెంట శాన రోజుల తర్వాత బుడుబుక్క మోగిస్తు బయటికి నడిచిండు.

''దొరగారి నాన్నగారు తాతగారు
చిన్నాన్న పెదనాన్న బిడ్డలు కొడుకులు
కూతుళ్లు మనమలు మునిమనవులు
అక్కచెల్లెళ్లు, తోటి కోడండ్లు తోడ పుట్టినోళ్లు అత్తింటోళ్లు, పుట్టింటోళ్లు బంధువులు సల్లగుండాలె! వాళ్ల ఉద్యోగాలు వ్యాపారాలు సల్లగుండాలె. అన్నదానం చెయ్యాలె. వస్త్రదానం చేయాలె!''..

తెల్లారగట్ల అయింది. ఓ ఇంటి ముందట గంట చప్పుడిని..

''ఓసామీ.. ముందు నోరుముయ్. పెద్దయ్య నిద్ర పాడైతే నీది, నాది తోలొలుస్తడు. పో.. ఈడ్నించి పోపో!''..

ఆ మాట లేవి వినపడని పెద్ద బైరాగి..

''ఓ దొరా.. మా దొరా..
త్యాగాల దొరా.. బోగాల దొరా..
మా దొర లోగిల్లో మా లచ్చిముండాలె!
మా దొర పట్టిందె బంగార మవ్వాలె!
తలిచిందంత నడిచి రావాలె!''..

బైరాగి కండ్లు బైర్లుగమ్మినయ్. జానెడు పొడ్గు నాల్కతో మీదికి దుంకిన పెద్దపులంటి కుక్క.. ముందరి రెండు కాళ్లతోని బైరాగి శరీరాన్ని నిచ్చెన మాదిరెక్కి జోలెనుపీకి.. పంచె, చొక్కా పీకేస్తుంటే ఎన్కకెన్కకు నడిచి కూలబడ్డడు. ఎవలో వచ్చి..

''వార్నీ. ఎంత పనైందీ!? కుక్క పొడ్గాను. గొలుసు తెంపుకొన్నది'' అనుకుంట గొలుసుతో కుక్కను లోపల్కి పట్కపోయిండు.

బైరాగి అర్ధనగ్న దేహం నేలమీద పడిపోయింది. జుట్టు కొప్పు ఇడిపోయి ఎంటికలు చెల్లాచెదురైనయ్. ఒళ్లంతా రక్తం గారుతూ పచ్చి పుండైంది. ఆడుతా పాడుతా ఎగిరే పిట్ట రెక్కలు తెగి జటాయువులా నేలకొరిగింది.

పైన ఆకాశంలో నల్ల మబ్బుసాటు చంద్రుడు బొగ్గుల మధ్యన నిప్పులెక్క ఉన్నడు. కను రెప్పలు మూసిన బైరాగి కళ్లనుంచి నీళ్లు కార్తనే ఉన్నయ్. నోటి నుండి ఆకలి పాట పాడ్తనే ఉండు.

''అంబ పలుకు జగదంబ పలుకు
ఇటువంటి ఊర్లల్లో ఎవ్వరుండొద్దు
టక్కు ఎక్కుల ఊరు కుక్కలుండే ఊరు.
నా రుత్తి, నా తన్వు కుక్క పాలాయె.
ఇటువంటి ఊర్లల ఎవ్వరుండొద్దు.
ఇంకో.. ఇం..కో ఊ..ర్కి పోతున్న నే.. ను!''

కొస పాటను, కొస ఊపిర్ని గాలికొదిలిండు.. ■


## వేముగంటి శుక్తిమతి



ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి, రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు వేముగంటి శుక్తిమతి. వీరి స్వస్థలం హన్మకొండ. ఇప్పటివరకు 40 కథలు, 90 కంటే ఎక్కువ వ్యాసాలు, ఆరు నవలలు, సాయిబాబా పారాయణ గ్రంథం రాశారు. మొదటి కథ.. 'మానవత్వం మరిచిన వేళ'. ఈ కథకు 1997లో ఆంధ్రభూమి సచిత్ర వారపత్రికలో ఉగాది కథల పోటీలో మొదటి బహుమతి దక్కింది. 'నేటి మనిషి' కథకు ఉపాసం సంస్థ నిర్వహించిన కథల పోటీలో బహుమతి లభించింది. 2020లో నమస్తే తెలంగాణ – ముల్కనూరు గ్రంథాలయం కథల పోటీలో 'సుక్కబర్రె' కథకు విశిష్ట బహుమతి, 'ఊరు పిలిచింది' కథకు పాలపిట్ట కథల పోటీలలో ప్రత్యేక బహుమతి, 'చివరి కోరిక' కథకు వాసా ఫౌండేషన్ కథల పోటీలో రెండవ బహుమతి అందుకున్నారు. మొదటి నవల.. 'మళ్లీ పల్లె ఒడిలోకి' అంపశయ్య నవీన్ నవలల పోటీ (2016)లో బహుమతికి ఎంపికైంది. వీరు రాసిన అనేక కథలు, వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి.